నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం అంతరాయం కలుగుతుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 నుంచి 11 గంటల వరకు..

- లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సంగం లక్ష్మీబాయ్ కాలేజీ, కరణ్‌బాగ్, జీఏ పార్క్, జీఏ కాలనీ, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీ హాల్, దోబీఘాట్, మటన్ మార్కెట్, రాణిబాగ్, బాదంగల్లీ, వాటర్ పంప్‌హౌజ్, పద్మానగర్, నాగబౌళి, బిస్మిసా బంగ్లా, కమలేషా మాస్క్, ఫరత్‌నగర్ గ్రేవ్ యార్డ్, ఎంఆర్ఓ ఆఫీస్, డాన్ స్కూల్, బీబీ కేన్సర్ హాస్పిటల్, ఇబ్రహీం ఫంక్షన్ హాల్, మాలికా మాస్క్, బాబు మియా గిర్నీ, రెయిన్ బజార్, రాంచంద్రనగర్, మస్కతి డైరీ ఫాం, వివేకానంద స్కూల్, దరాబ్ జంగ్ కాలనీ, కార్నర్ టీ పాయింట్, నెహ్రూనగర్, మస్కతి పార్క్, రాంబజార్ గ్రౌండ్, రెయిన్ బజార్ చమన్, ఆర్‌కే హోటల్, మొగల్ టీ పాయింట్, కుమ్మరివాడి పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

- లక్ష్మీనగర్ క్రాస్ రోడ్, వాణినగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కట్ ఫ్యాక్టరీ, దోబీఘాట్ రోడ్, ఏపీఏయూ కాలనీ, వెంకటేశ్వర కాలేజ్, తిరుమలహిల్స్, ఇండస్ ల్యాండ్ బ్యాంక్, శ్రీపురం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఈస్ట్ అరోరా కాలేజ్ ఆపోజిట్, రామాలయం టెంపుల్, హదీ అఫ్రీన్ మజీద్, మూన్లీ స్కూల్, సీఐబీ క్వార్టర్స్, ఓల్డ్‌మలక్‌పేట వాటర్ ట్యాంక్, జియా ఉల్ కా మజీద్, అబుబకర్ మజీద్, నూర్‌ఖాన్ బజార్ ఆఫీస్, లాల్ మిట్టీ దర్గా, దిల్‌కుషా ఫంక్షన్ హాల్, ఆర్యసమాజ్, అమీర్ ఫాతిమా మాస్క్, రామాలయం టెంపుల్, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్, దయానంద్ నగర్, ఓల్డ్ ఈద్గా, దర్బాజంగ్ కాలనీ, చోటుభాయ్ కాలనీ, మాదన్నపేట వాటర్ ట్యాంక్, సాయిబాబా టెంపుల్, కేజీపీఎస్ బేకరీ, ఓల్డ్ పీఎస్, వినాయక్ నగర్, దోబీఘాట్, చంద్రయ్య హట్స్, ఖాసీం కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

పుష్కరాల్లో జైళ్ల శాఖ స్టాల్



కాళేశ్వరంలో ఔట్‌లెట్ ప్రారంభిస్తున్న డీజీ డా.సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: వేస్ట్ టు వెల్త్ కార్యక్రమంలో భాగంగా జైళ్లలో ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్య మిశ్రా అన్నారు. కాళేశ్వరంలో సరస్వతి పుష్కరోత్సవాల్లో భాగంగా జైళ్ల శాఖ ఔట్‌లెట్‌ను శుక్రవారం ఏర్పాటు చేసింది. ఈ ఔట్‌లెట్‌ను డీజీ ప్రారంభించారు. ఔట్‌లెట్‌లో అగర్‌బత్తీలు, బెడ్‌షీట్లు, సబ్బులు, చేతితో నేసిన వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, అధికారి కళాసాగర్, సిబ్బంది ఉన్నారు.

బాలిక అదృశ్యం

చంచల్‌గూడ: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ బాలిక తిరిగి రాలేదు. ఈ ఘటన శుక్రవారం మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాకుత్‌పురాలో నివాసం ఉండే కుమారి సోఫియా బేగం(16) స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. గురువారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో యువతి కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

19న ఉచిత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

శాలిబండ: ఖాజీపురాలోని సయ్యద్ మంజిల్‌లో ఈ నెల 19న ప్రజల కోసం ఉచిత ఆధార్ కార్డు క్యాంపును ప్రారంభించనున్నట్లు ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ సయ్యద్ ఖాద్రీ తెలిపారు. ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ భారత ప్రభుత్వ ఇండియా పోస్ట్ సహకారంతో ఆధార్ కార్డు క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తుందన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక మసీదులో నిర్వహించిన ప్రార్థనల అనంతరం యాకుత్‌పురా, రెయిన్‌బజార్ చమన్, బడా బజార్, షౌకాత్ జంగ్ దేవిడి, దరాబ్ జంగ్ కాలనీ, గంగానగర్ నాలా తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక బస్తీల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బస్తీలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి నూతన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎక్కడ సమస్యలు లేకుండా అన్ని విభాగాల అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సత్యనారాయణపురం కాలనీలో గుంతల రహదారులు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

చైతన్యపురి: అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ లైన్ వేసేందుకు తవ్విన రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో అధ్వానంగా తయారైంది. కంకరతేలి, గుంతలు పడి రాకపోకల సమయంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చైతన్యపురి డివిజన్‌లోని సాయినగర్ కాలనీ నుంచి సత్యనారాయణపురం మీదుగా చైతన్యపురి **కాలనీకి వెళ్లే రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది**. పైప్‌లైన్ పనులు పూర్తయ్యి ఏడాది దాటినా మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి మీదుగా నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, కార్లు, డీసీఎం, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. నూతన **రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనట్లు అధికా**రులు చెప్పినా పనులు ప్రారంభించలేదని అంటున్నారు. సుమారు కిలోమీటర్ మేర రహదారి పూర్తిగా పాడై మట్టి రోడ్డును తలపిస్తోందని అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ఆటలు ముఖ్యం



బండ్లగూడ సహభావన టౌన్‌షిప్‌లో బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ సహభావన టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును శుక్రవారం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజూ ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలతో గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా ఆటలు ఆడేవారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రముఖ న్యాయవాది ఫణికుమార్, కాంగ్రెస్ నాయకులు నరేష్, ప్రగతి, చైతన్య, శరత్, నాగరాజ్, విష్ణు, ప్రకాశ్, అభి, రాజేందర్ రెడ్డి, ఢిల్లీ నరేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

21 నుంచి శ్రీగణేష్ ఆలయ వార్షికోత్సవాలు

ఎల్‌బీనగర్: ఎన్జీవోస్‌కాలనీలోని శ్రీగణేష్ దేవాలయ వార్షికోత్సవాలను 21నుంచి 27వరకు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సోమయాజులు తెలిపారు. 21వ తేదీన ఆలయ శుద్ధి, గణపతి పూజ, గోపూజ, 22న శ్రీదాసాంజనేయస్వామి వారికి భక్తుల గోత్రనామాలతో పంచామృతాభిషేకం, సుదర్శనయాగం, 23న శ్రీలక్ష్మీ గణపతి స్వామి వారికి పంచామృతాభిషేకం, ఉమామహేశ్వరుల దివ్య కల్యాణం, 24న నవగ్రహాలకు అష్టోత్తర పూజలు, 25న భక్తుల గోత్రనామాలతో

అంజన్న జాతరలో అన్నదానం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి సాగుతున్న జాతర శుక్రవారం ముగిసింది. చివరి రోజు సామ ధర్నారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీకృష్ణ, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ పూజారి దీన్‌దయాల్, హేమంత్‌త్రివేది, ముద్దగౌని చంద్రకాంత్, నాగరాజుగౌడ్, బాలరాజు, మహేష్, నారాయణ తదితరుల పాల్గొన్నారు.



అండర్-14 టీ20 టోర్నీ విజేత బి స్పోర్టీ అకాడమీ

సాక్షి, సిటీబ్యూరో: జూనియర్ క్రికెటర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో '7హెచ్ స్పోర్ట్స్' సంస్థ నిర్వహించిన అండర్ 14 టీ ట్వంటీ టోర్నీ ఘనంగా ముగిసింది. నాగోలులో నిర్వహించిన ఈ టోర్నీలో నగరానికి చెందిన సరోజినిదేవి క్రికెట్ అకాడమీ, సంజయ్ క్రికెట్ అకాడమీ, ఎస్ వైపీ క్రికెట్ అకాడమీ, బి స్పోర్టీ క్రికెట్ అకాడమీ, సెంచరీ లెజెండ్స్ జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. ఈ టోర్నీలో బి స్పోర్టీ క్రికెట్ అకాడమీ విజేతగా నిలిచింది. ఫైనల్లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో సెంచరీ లెజెండ్స్ టీమ్ పై విజయం సాధించింది. బి స్పోర్టీ బౌలర్ ఆరుష్ వోరా బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. ఈ టోర్నమెంట్లో ఒక సెంచరీతో పాటు ఒక డబుల్ సెంచరీ చేసిన నితీష్ నాయక్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా నిలిచాడు. విజేతలకు బాబురావు సాగర్ క్రికెట్ క్లబ్ ఫౌండర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బాబురావు , వాకర్ టౌన్ టికెట్ క్లబ్ మెంబర్ పి.టి రాజు, ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వైజాగ్ వారియర్ సీఈఓ భరణి,7హెచ్ స్పోర్ట్స్ ఫౌండర్ వెంకటేశ్ ట్రోఫీలు అందజేశారు. జూనియర్ స్థాయిలో ఎంతో టాలెంట్ ఉందని, వారిని ప్రోత్సహించేందుకే ప్రతీ ఏడాదీ ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్టు 7హెచ్ స్పోర్ట్స్ ఫౌండర్ వెంకటేశ్ చెప్పారు.



రంగారెడ్డి కోర్టు వద్ద న్యాయవాదుల ర్యాలీ

ఎల్‌బీనగర్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు శుక్రవారం రంగారెడ్డి కోర్టు ఎదుట తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన టూరిస్టుల ఆత్మకు శాంతి చేకూర్చాలని అన్నారు. ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో కార్తీక్, రామచందర్‌రావు, రంగారావు, రమేష్, అనసూయ, ప్రశాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ఉగ్రదాడికి నిరసనగా రంగారెడ్డి జిల్లా కోర్టు ఎదుట ర్యాలీ నిర్వహిస్తున్న అడ్వకేట్లు

ఆయువు తీసిన ఆట వస్తువు

- ఎయిర్‌స్వింగ్ పరికరం పడి ఐదేళ్ల చిన్నారి మృతి
- మీర్‌పేట్‌లోని చిల్డ్రన్స్ పార్కులో ఘటన



మీర్‌పేట: ఓపెన్‌జిమ్ పరికరం తలపై పడటంతో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లెలగూడలోని దాసరి నారాయణ కాలనీకి చెందిన ప్రసాద్ కుమారుడు నిఖిల్ (5) గురువారం సాయంత్రం స్థానికంగా ఉండే పిల్లలతో కలిసి రోజూ మాదిరిగానే ఆడుకునేందుకు పక్కనే ఉన్న చిల్డ్రన్స్ పార్కుకు వెళ్లాడు. ఓపెన్ జిమ్‌లోకి వెళ్లి ఎయిర్ స్వింగ్ పరికరంపైకి ఎక్కాడు. దీనికి సంబంధించిన ఇనుపకడ్డీ తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఓపెన్ జిమ్‌లోని ఎయిర్ స్వింగ్ పరికరం పాడైపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. పాడైన పరికరం పక్కన పడేసి ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు దీన్ని యథా స్థితిలో పెట్టారు. ఇది తెలియని చిన్నారి ఎయిర్ స్వింగ్‌పైకి ఎక్కడంతో ఇనుప బొంగు నిఖిల్ తలపై పడింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని వాకర్స్, స్థానిక కాలనీలవాసులు మండిపడ్డారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- మృతుడి భార్యకు రూ.12 లక్షల పరిహారం?

హస్తినాపురం: వైద్యం వికటించడంతోనే వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. మృతుడి బంధువులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామర బీమనపల్లి గ్రామానికి చెందిన సిల్వేరు మల్లయ్య(42) 2013లో రోడ్డు ప్రమాదానికి గురవ్వగా కాలు విరిగింది. ఆపరేషన్ చేసి కాలులో ఐరన్ రాడ్ వేశారు. కొంతకాలం నుంచి కాలులో నొప్పిరావడంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో గతనెల 21న వైద్య పరీక్షలు చేయించగా ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, తిరిగి రాడ్ మార్చాలని చెప్పినట్లు మృతుడి బంధువులు తెలిపారు. గతనెల 22వ తేదీన హస్తినాపురంలోని నవీన ఆస్పత్రి నిర్వాహకుడు సుధాకర్‌రెడ్డి రూ.2 లక్షల ఇస్తే కాలులో కొత్తరాడ్ వేస్తామని చెప్పడంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. ఆపరేషన్ చేసే సమయంలో విడతలవారీగా రూ.4 లక్షలు ఆస్పత్రిలో చెల్లించామని, మందులు, రక్తం, రక్తకణాల కోసం మరో రూ.2 లక్షలు చెల్లించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. ఆపరేషన్ చేసిన అనంతరం ఇన్‌ఫెక్షన్ వచ్చిందని చెప్పి కొన్ని రోజులుగా ఆస్పత్రిలోనే ఉంచారు. వెంటిలేటర్‌పై ఉన్నాడని, త్వరలోనే కోలుకుంటాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అకస్మాత్తుగా గురువారం అర్ధరాత్రి మృతి చెందాడని చెప్పడంతో శుక్రవారం ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. మీర్‌పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి భార్యకు రూ.12 లక్షల పరిహారం ఇచ్చినట్లు సమాచారం. అనంతరం మల్లయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

రక్షణ రంగంలో స్వదేశీకరణకు కృషి

సంతోష్‌నగర్: రక్షణ రంగంలో ప్రభుత్వ దార్శనికత ''మేక్ ఇన్ ఇండియా'', ''ఆత్మనిర్భర్ భారత్''కు అనుగుణంగా రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కంచన్‌బాగ్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ప్రాంగణంలో శుక్రవారం రక్షణలో స్వదేశీకరణను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ సమావేశాన్ని–2025 నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.ఎస్.నారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన లోహాల స్వదేశీకరణలో ఎంఎస్ఎంఈల పాత్రను వివరించారు. వీటిలో చాలా వరకు ప్రస్తుతం భారతదేశ వ్యూహాత్మక, రక్షణ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకుంటున్నారన్నారు. రక్షణ సామగ్రి రంగంలో స్వావలంబన, స్థిరత్వాన్ని నిర్ధారించడానికి దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. మిధాని డైరెక్టర్ (ప్రొడక్షన్, మార్కెటింగ్) టి.ముత్తు కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా, రక్షణలో ఆత్మ నిర్భరత కార్యక్రమాలకు మిధాని మద్దతును అందిస్తుందన్నారు. వ్యూహాత్మక పదార్థాలు, తయారీలో ఆవిష్కరణ, సామర్థ్య అభివృద్ధిని పెంపొందించడానికి ఎంఎస్ఎంఈలతో నిరంతర సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మిధాని జీఎం (ఫైనాన్స్) కె.మధుబాల, ఏజీఎం (ఐ/సీ కొనుగోలు) శుభదీప్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో మురుగు కలువకుండా చర్యలు చేపట్టాలి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువులో మురుగు కలవకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దచెరువులోకి వరదనీరు చేరుతోందన్నారు. చింతకుంట చెక్‌పోస్ట్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లోని వరదనీరు పెద్దచెరువులోకి చేరేందుకు వరద కాలువ పైపులైన్ వేయడం జరిగిందని, ఈ పైపులైన్లకు డ్రైనేజీ లైన్లు కలపడంతో మురుగు చెరువులోకి చేరుతోందన్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేసి వరద కాలువలోకి మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వరద కాల్వలో మురుగు కలుపుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శేఖర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు మొరిశెట్టి సంతోష్, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీకి చెక్



మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్: డెంగీ వ్యాప్తి చెందకుండా ప్రజలు, ప్రభుత్వం, ఆరోగ్య సంస్థలు కలిసి పనిచేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు నుంచి చింతలకుంట వరకు ఎల్‌బీనగర్ సర్కిల్ ఎంటమాలజీ, అధికారులు, సిబ్బంది శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వరం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తే దోమలతో వ్యాప్తి చెందే ఈ వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. దోమల స్వైరవిహారం లేకుండా ఉండేందుకు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డెంగీ కారణంగా జ్వరం, తలనొప్పి, వాంతులు, చర్మంపై దద్దుర్లు వంటివి వ్యాప్తి చెందుతాయని, వెంటనే ప్రజలు అప్రమత్తంగా ఉండి సమీపంలోని వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజీ అధికారి మాధవరెడ్డి, సహాయ ఎంటమాలజీ అధికారులు రవీంద్రారెడ్డి, రాంబాబు, మణి, నాయకులు రఘువీర్‌రెడ్డి, యాదగిరి, వేణు, ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లకు చెందిన ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ రహిత నగరం అందరి బాధ్యత

మన్సూరాబాద్: పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకుంటే డెంగీ వ్యాధి వ్యాప్తిచెందకుండా నియంత్రించవచ్చని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి చంద్రపురికాలనీ కమ్యూనిటీహాల్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించి, కాలనీ కమ్యూనిటీహాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం డ్రై డేగా పాటించాలన్నారు. డెంగీ రహిత నగరంగా మార్చడం అందరి బాధ్యత అన్నారు. ఎంటమాలజీ అధికారులు మాధవరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, చంద్రపురికాలనీ, సూర్యోదయకాలనీ, సరస్వతినగర్‌కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ డెంగీ దినోత్సవం ర్యాలీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంటమాలజీ సిబ్బంది

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సుజాతకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ కాలనీ చెందిన సుజాత ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తనను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్‌ను కలిసి పరిస్థితి వివరించడంత ఆయన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి రిలీజ్ అయిన రూ.32 వేల చెక్కును శుక్రవారం సుజాతకు ఆయన అందజేశారు. టీపీసీసీ సభ్యులు గజ్జి భాస్కర్, రాష్ట్ర సేవాదల్ నాయకులు ఎండీ షరీఫ్, జహంగీర్ బాబాగౌడ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

మన్సూరాబాద్: భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో హయత్‌నగర్ లేబర్ అడ్డా వద్ద సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈనెల 20న పరిశ్రమలు, కార్యాలయాల్లో ప్రదర్శనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. భారత్, పాక్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సమ్మెను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మందుల కృష్ణ, శ్రీదేవి, రమావత్ సక్రు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ లేన్ పనులు ఆపాలి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని కొలీషియం బహుళ అంతస్తుల మాల్ వరకు పలు కాలనీల ప్రధాన రహదారుల మీదుగా నూతనంగా ఏర్పాటు చేయనున్న హైటెన్షన్ విద్యుత్ లేన్ ఏర్పాటు పనులు నిలిపివేయాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సాయిరాం నగర్, ప్రెస్, మల్‌రెడ్డినగర్ వంటి కాలనీల్లో శుక్రవారం ఆయన పాదయాత్ర నిర్వహించి విద్యుత్ పోల్స్ ఏర్పాటు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పనులు నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొలీషియం మాల్ నుంచి బైరామల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేవలం అర కిలోమీటరు దూరం మాత్రమే ఉన్నా రెండున్నర కిలోమీటరు దూరం ఉన్న చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మాత్రమే హైటెన్షన్ లేన్లు ఏర్పాటు చేయడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో బాధిత కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, ఆనంద్‌రెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, వేణుగౌడ్ నాయకులు సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, శ్రీనివాస్, యాదయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.